# ఆదర్శ దేశం

ఏ వ్యక్తికైనా, ఏ దేశానికైనా ఆదర్శం ఉండాలి. ఆదర్శం ఉన్నప్పుడే లక్ష్యమూ ఉంటుంది. నైతిక బలమూ వుంటుంది.

సుఖ శాంతులతో ఉండే దేశాన్ని రామరాజ్యం అంటాం. ప్రజల కష్టసుఖాలు తనవిగా చేసుకుని శ్రీరాముడు దేశాన్ని పాలించాడు కనుకే రామరాజ్యం అనే పేరు వచ్చింది. అలా పాలించడం శ్రీరాముడి ఆదర్శం. ఒకే భార్య ఒకటే బాణం కూడా రాముడి ఆదర్శం. ఆ కాలంలో ఆదర్శం పరిధి చిన్నది. లక్ష్యం పరిధి కూడా చిన్నదే.



ఇప్పుడు 'ఆదర్శం' పరిధి చాలా విస్తృతంగా ఉంది. అలాగే లక్ష్యం పరిధి కూడా. ఇప్పుడెన్నో వ్యవస్థలు. ఎన్నో రంగాలు.

ప్రతి వ్యవస్థకూ, ప్రతి రంగానికీ ఒక లక్ష్యం ఉంటుంది. ఈ వ్యవస్థలకూ, రంగాలకూ దేశం ఆధిపత్యం వహిస్తుంది. అంచేత వాటిని దేశం ప్రోత్సాహించవలసి ఉంది. ఎందుచేతనంటే, ఈ రంగాలలోని ప్రతిభావంతుల కారణంగా దేశానికి పేరు ప్రఖ్యాతులు వస్తాయి కాబట్టి.

రవీంద్రనాథ్ టాగూర్ వల్ల భారతదేశానికి పేరు ప్రతిష్టలొచ్చాయి. ఇక పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సరేసరి. బెంగాల్ రవీంద్రునికి పట్టం కట్టింది. అటాగే సైంటిస్టు రామన్ భారతదేశానికి పేరు తెచ్చాడు.

అలాగే మహాకవులు గురజాడ, శ్రీశ్రీ వంటి వాళ్ల వల్ల మన రాష్ట్రానికీ పేరు వచ్చింది.

క్రీడారంగం వల్ల కూడా ఆయా దేశాలకు పేరు ప్రఖ్యాతులొస్తాయి మన దేశానికి పి.టి. ఉష వల్ల పేరొచ్చింది. కోడి రామ్మూర్తి వల్ల పేరొచ్చింది,

పి.టి. ఉష కాలంలోనే వలసమ్మ వల్ల కూడా దేశానికి పేరొచ్చింది. ఢిల్లీలో జరిగిన ఆసియాడ్ క్రీడల పరుగు పందెంలో వలసమ్మ బంగారు పతకం సాధించింది.. "వలసమ్మ బంగారం భారత్‌కు సింగారం" అనే శీర్షికలతో పత్రికలు కూడా ఆమె ప్రతిభను చాటి చెప్పాయి. అలాంటి వలసమ్మను 1980లలో జరిగిన ఓ సభలో అలక్ష్యం చేశారు. మంత్రులు, అధికారులకు ప్రాముఖ్యం ఇచ్చి, ఆమెను చిన్న చూపు చూశారు. అప్పుడా సభలో వలసమ్మ తన ఆవేదన వ్యక్తం చేసింది. క్రీడాకారులకిచ్చే ప్రాధాన్యం ఇదా అని ప్రశ్నించింది. అంతే, ఆమె ప్రతిభను బ్యూరోక్రసీ నేలరాసింది. అందువల్ల జరిగిన నష్టం ఆమెకే కాదు, దేశానికి కూడా.

ఇక పి.టి. ఉష తన ప్రతిభ ద్వారా భారతదేశానికి ప్రపంచ క్రీడారంగంలోనే పేరు ప్రతిష్టలు తెచ్చింది. బంగారు లేడిగా ఆ లేడీ ప్రపంచం చేత పిలిపించుకుంది. అలాంటి పరుగుల రాణి రైల్వేలో చేస్తున్న తన ఉద్యోగంలో రావల్సిన ఇంక్రిమెంట్ల కోసం పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది.

చేస్తున్న తన ఉద్యోగంలో రావల్సిన ఇంక్రిమెంట్ల కోసం పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఎంతో క్రమశిక్షణతో, జీవితమే పరుగుగా, పరుగే జీవితంగా తన ప్రతిభను సాన పెట్టుకున్న ఓ ప్రముఖ క్రీడాకారిణి పరిస్థితి చూసేక, మరింత ప్రతిభావంతులు ఎలా వస్తారు?

ప్రతిభకు ప్రోత్సాహం లేకపోతే నష్టపోయేది ఆ వ్యక్తే కాదు, ఆ రంగం, ఆ దేశం కూడా.

సాకర్ రంగంలో మారడోనా ఓ మెరుపుతీగ. ఓ మహోన్నత శిఖరం. ఓ సమున్నత కెరటం. ఫుట్‌బాల్ మైదానంలో ప్రవేశించాక మారడోనా పరుగులో, నడకలో, కాళ్ల కదలికలో ఎంత సౌందర్యం! ప్రతిభ కూడా ఎంత అందంగా ఉంటుందో!

అర్జెంటీనా అంటే మారడోనా. మారడోనా అంటే అర్జెంటీనా. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీల్లో నైజీరియాపై తన దేశాన్ని గెలిపించిన మారడోనాను ఆ తర్వాత డ్రగ్స్ తీసుకున్నాడనే కారణంతో పోటీల నుంచి బహిష్కరించారు. చిన్న పొరపాటుకు అతి పెద్ద శిక్ష అనుభవించి అనంతమైన ఆవేదనకు గురైన మారడోనాకు అర్జెంటీనా అండగా నిలిచింది.

"మన దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన మన మారడోనా ఇప్పుడు కష్టంలో ఉన్నాడు. మనమంతా అతనికి అండగా ఉందాం. అతన్ని మానసిక ఒత్తిడి నుంచి తప్పిద్దాం. మన మారడోనాను మనం కాపాడుకుందాం" అని అర్జెంటీనా దేశాధ్యక్షుడు కార్లోస్ మెనెమ్ తన దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశాడు.

అదీ దేశమంటే. అలాంటి దేశంలో మరెందరో మారడోనాలు తప్పక వస్తారొస్తారు. ప్రతిభకు పట్టం కట్టే అర్జెంటీనా మనలాంటి దేశాలకు ఆదర్శం కావాలి.

11.7.94

ఆంధ్రభూమి దినపత్రిక